# హనోయ్ సమావేశం బట్టబయలైన అమెరికా

**వియత్నాం** రాజధాని హనోయ్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కూ, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్‌కూ నడుమ 2019 ఫిబ్రవరి 27, 28 తేదీలలో జరిగిన రెండు రోజుల శిఖరాగ్ర సమావేశం ఎలాంటి ఒప్పందం లేకుండానే హఠాత్తుగా ముగిసిపోయింది.

సమావేశంలో ఏమి జరిగిందన్నది ఎవరి కథనాన్ని వారు చెప్పుకున్నారు. ఉత్తరకొరియా వారేమని చెప్పారంటే–"2016 నుండి ఉత్తర కొరియాపై రుద్దుతున్న ఆంక్షలను ఉపసంహ రించుకుంటే, మా యాంగ్ బైయన్ స్థావరంలో గల యురేనియం, ప్లోటోనియంలను మరింత వృద్ధిపరచటాన్ని ఉపసంహరించుకుంటాము" అని పేర్కొన్నారు. దీన్ని ట్రంపు తిరస్కరించి, అణుపరికరాల రద్దుకై తగిన చర్యలు చేపట్టమని డిమాండ్ చేశాడు. "వాళ్ళు ఆంక్షలన్నిటినీ రద్దుచేయమంటున్నారు కానీ మేమలా చేయలేము" అన్నాడు ట్రంప్. సుదీర్ఘకాలంగా శత్రుత్వమూ, ఉద్రిక్తతలూ మరియు యుద్ధ వాతావరణం కొనసాగిన పిదప, 2018 జూన్ నుండి అమెరికా, ఉత్తరకొరియా దేశాల నడుమ సంభాషణల ప్రక్రియ ఆరంభమయిందని మనకు తెలుసు. "కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్ర రహితం" కావించాలని శిఖరాగ్ర సమావేశం జరుగుతోంది. అయినప్పటికీ ఉభయదేశాల నాయకులకూ ఈ పిలుపుపట్ల వేర్వేరు దృక్పథాలుండనే వున్నాయి. అమెరికా ఉద్దేశంలో పై పిలుపు ఉత్తరకొరియా కొక్కదానికే పరిమితం. దాని అర్థం ఏమంటే–ఉత్తరకొరియా తన అణ్వస్త్రాలనూ అణ్వస్త్ర ఏర్పాట్లనూ ధ్వంసం కావించమని, భవిష్యత్తులో అలాంటి ఆయుధాలను తయారుచేయదనే హామీని, నమ్మకాన్ని యిచ్చి అమెరికాకు సంతృప్తి కలిగించాలి. అయితే ఉత్తరకొరియా దృష్టిలో పై షరతులు అమెరికాకు కూడా వర్తిస్తాయనీ, కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్రాలనుండేకాక అణ్వస్త్రాల బెదిరింపులు కూడా లేని ప్రదేశంగా చేయటం అమెరికా బాధ్యత అని తలుస్తోంది.

ఈ విరుద్ధ దృక్పథాలు మొదటి శిఖరాగ్ర సమావేశ తదనంతర స్ఫూర్తిని ప్రతిబింబి స్తున్నాయి. రెండు దేశాల నడుమ పరస్పర విశ్వాసాన్ని పెంపొందించే, పరిస్థితులను సాధారణీకరించే ఎలాంటి ముందడుగులకు అమెరికా చొరవ చేయటంలేదు. దక్షిణ కొరియా దేశంలో ఇప్పటికే 28000 మంది అమెరికా సాయుధ బలగాలను కొనసాగిస్తూన్న కారణంగా కొరియా ద్వీపకల్పంలో 1953 నాడు అమెరికా రుద్దిన యుద్ధవాతావరణం యింకా కొనసాగుతూ వుంది. ఉత్తరకొరియాను అణ్వస్త్ర రహితంగా చేయటానికి అమెరికా అధికారులు చాలా తలబిరుసుతనాన్ని ప్రదర్శించారు. ఆఖరికి హనోయ్ శిఖరాగ్ర సమావేశం అనేక అడ్డంకులను ఎదుర్కోవలసివచ్చింది.

కనుక హనోయ్ శిఖరాగ్ర సమావేశం నుండి అద్భుత ఫలితాలనేమీ ఊహించలేము.

ఉత్తరకొరియాతో చర్చలపట్ల అమెరికా వైఖరిలో రెండు కోణాలున్నాయి.

1. "ఉత్తరకొరియా సంపూర్ణంగా అణ్వస్త్ర రహితమవటం ద్వారా ఆర్థిక సంపన్నశక్తిగా మారుతుంది" అని ట్రంపు ఆకట్టుకునే ప్రకటన వదిలాడు. "ఉత్తర కొరియా వేగంగా అణ్వస్త్ర రహితమవటానికి తీవ్రంగా యత్నిస్తుంది" "విస్మయ పరిచేంత శక్తితో చరిత్రలో దాదాపు మరెవరికీ రాని గొప్ప అవకాశం మీ మిత్రుడు కిమ్‌జోంగ్–ఉన్‌కు లభిస్తోంది".

2. "నేనెవరినీ తొందర పెట్టను. నేనెలాంటి పరీక్షలూ కోరను. పరీక్షలు లేనతకాలం మనకి సంతోషం".

ఉత్తర కొరియాను అమెరికాకు ఉపగ్రహ రాజ్యంగా, అమెరికా సామ్రాజ్యవాద ఆర్థిక స్థితిగతుల పైన ఆధారపడే దేశంగా, రాజకీయంగా మిలిటరీరీత్యా పరాధీనదేశంగా రూపొందేట్లు ఒక దీర్ఘకాలిక వ్యూహంతో అమెరికా వ్యవహరిస్తోంది. ఉత్తరకొరియాను భూమిపై స్వర్గంగా కాకుంటే ఆర్థికసంపన్న శక్తిగా మార్చే వాగ్దానాలకు వేరే అర్థాలు యింతకంటె వుండదు.

oooo